క్లుప్తంగా

రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

చీమకుర్తి రూరల్: మండల పరిధిలోని రేషన్‌కార్డుదారులంతా రేషన్ డీలర్ వద్ద ఉన్న ఈ పాస్ మిషన్ ద్వారా ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరిగా చేయించుకోవాలని మండల రెవెన్యూ అధికారి ఆర్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డులో పేర్లున్న ప్రతి లబ్ధిదారుడు వారి రేషన్‌కార్డునకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని, చేయించుకోకుంటే నిత్యావసర సరుకులు ఆగిపోయే అవకాశం ఉందని వెల్లడించారు.

చెత్త ట్రాక్టర్ల ట్రక్కు ఎత్తు పెంచాలి

ఒంగోలు సబర్బన్: చెత్త తీసుకెళ్లే ప్రతి ట్రాక్టర్‌కు ట్రక్కు ఎత్తు పెంచాలని, చెత్త తరలించే సమయంలో రోడ్లపై పడకుండా చర్యలు చేపట్టాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు ట్రాక్టర్ల యజమానులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో చెత్త తరలించే ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ట్రాక్టర్‌లో చెత్త నిండిన తర్వాత మాత్రమే ఆ చెత్తను గుత్తికొండవారిపాలెంలోని డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. అలా కాకుండా వేరే చోట్ల పోసినట్లతే వెంటనే ఆ ట్రాక్టర్‌ని తొలగిస్తామని హెచ్చరించారు. ట్రాక్టర్లలో చెత్త తీసుకెళ్తున్నప్పుడు ఆ చెత్తకు తప్పనిసరిగా పూర్తిగా పట్ట కప్పి ఎక్కడా కింద పడకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ సూపర్వైజర్‌కి సూచించారు. డ్రైవర్‌లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాక్టర్‌కు కూడా తప్పనిసరిగా ఆర్సీ బుక్ ఉండాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

31లోగా రైతు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలి



రైతు విశిష్ట సంఖ్య నమోదు గురించి వివరిస్తున్న విజయనిర్మల

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆత్మ డీపీడీ ఎం.వి జయనిర్మల శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమం, పంటల సాగుకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు రైతులకు అందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరని తెలిపారు. తద్వారా సొంత భూమి గల ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు తెలిపారు. సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని మాట్లాడుతూ మండలంలోని 9,173 మంది రైతులకుగానూ 6,300 మంది పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులలో 6,003 మందికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా మిగిలిన రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.వి.సుబ్బారెడ్డి, ఎంపీఈఓ జానకి, రైతులు పాల్గొన్నారు.

చెన్నకేశవుని ఆదాయం రూ.6.33 లక్షలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివారి ఆలయానికి 2 నెలల 25 రోజుల హుండీ ఆదాయం 6,33,102 రూపాయలు వచ్చినట్లు ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్వామివారి ఆలయంలో హుండీ కానుకలు లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.నాగమల్లేశ్వరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరునాళ్లకు ప్రత్యేక పోలీసు బందోబస్తు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీ నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూత కాటమరాజుస్వామి తిరునాళ్ల శనివారం జరగనున్న సందర్భంగా భద్రత ఏర్పాట్లను మార్కాపురం డీఎస్పీ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆలయం పరిసర ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో తిరునాళ్ల సందర్భంగా ముఖ్యంగా మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దొంగలను అరికట్టేందుకు పోలీసులతో పాటు మఫ్టీలో పోలీసులు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకర్, ఎస్ఐ అనిల్‌కుమార్ ఉన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

నాగులుప్పలపాడు: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు జయంత్ బాబు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు చార్జీలంటూ ప్రజలపై కూటమి ప్రభుత్వం భారం మోపుతోందని విమర్శించారు. విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు మాట ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ఎటువంటి చార్జీలూ పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం.. మాట తప్పిందని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం ఎవరి ప్రయోజనం కోసమో చెప్పాలన్నారు. గతంలో వాడుకున్న విద్యుత్‌కు ప్రస్తుతం బిల్లులు వేసే విధానాన్ని రద్దు చేయాలని



విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల కాలంలో రెండు దఫాలుగా ప్రజలపై 15,485 కోట్ల రూపాయల భారం మోపిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆ మీటర్లను పగులకొట్టండి అన్న లోకేష్.. నేడు ఎక్కడికి పోయాడని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్ సర్దుబాటు బిల్లుల భారం ప్రజలపై లేకుండా చేయాలని కోరుతూ విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్, నాయకులు బసవ పున్నయ్య, వెంకటేశ్వర్లు, మాదాసు నాగేశ్వరరావు, వెంకట్రావు, యోనా, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ వినియోగదారులపై రూ.15,450 కోట్ల భారం

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వినియోగదారులపై రూ.15,450 కోట్ల భారాన్ని మోపుతున్నారని సీపీఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చీమకుర్తిలోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. టైమ్ ఆఫ్ డే వంటి పద్ధతిలో విద్యుత్ వినియోగదారులపై కొత్తకొత్త విధానాల ద్వారా భారాలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, బెజవాడ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులు నమోదు చేయాలి

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆర్థిక, జీవనోపాధులకు సంబంధించిన సర్వేలో గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు సభ్యుల కుటుంబ రుణ ప్రణాళికను పక్కాగా నమోదు చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు సూచించారు. మండలంలోని చిలకపాడు, గంగవరం క్లస్టర్ల పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక, జీవనోపాధులకు సంబంధించి సంతనూతలపాడులోని మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం రెండో రోజు వీవోఏలు, వారి పరిధిలోని ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వెలుగు ఏపీఎం టి.బాబూరావు అధ్యక్షత వహించగా, ఎంపీడీవోతో పాటు డీఆర్డీఏ డీపీఎం, మండల స్పెషల్ ఆఫీసర్ పి.సనిత పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఈ సర్వే పూర్తి చేయాలని చెప్పారు. ఆయా నివేదిక ఆధారంగా వారి అవసరాల మేరకు ఆయా శాఖల నుంచి సబ్సిడీ రుణాలు, బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన ఈ సర్వేను పక్కాగా నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంతనూతలపాడు మండల వెలుగు ఏపీఎం బాబూరావు కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, చిలకపాడు, గంగవరం క్లస్టర్ల పరిధిలోని ఎన్యూమరేటర్లు, వీవోఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటిన డాక్టర్ ప్రశాంతి

కొత్తపట్నం: రెండు తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంతి జాయ్ అంతర్జాతీయ వేదికపై ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో హైదరాబాదులో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కొత్తపట్నానికి చెందిన ప్రశాంతి జాయ్ క్యాన్సర్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా పలువురు పాల్గొన్నారు. ఇందులో ప్రశాంతి ప్రదర్శించిన ప్రజంటేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఈమె జీబీ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తోంది. ఈ సందర్భంగా కొత్తపట్నానికి చెందిన ప్రజలు శుక్రవారం ఆమెను అభినందించారు. ఇంపాక్ట్ ఫౌండర్, ప్రముఖ మోటివేటర్ గంపా నాగేశ్వరరావు, సినీ దర్శకుడు, నటుడు, మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రసాద్, ఇంపాక్ట్ నేషనల్ సెక్రటరీ కె.రామచంద్రుడు చేతులమీదుగా ప్రశాంతి జాయ్ ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి సామాజిక సేవ చేస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రశాంతి జాయ్ ఆదర్శనీయమని అభినందించారు.



ప్రశంసపత్రం అందుకుంటున్న డాక్టర్ ప్రశాంతి జాయ్

ప్రాజెక్ట్ ఎక్స్ పో పోటీల్లో మెరిసిన రైజ్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లోని ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు, వివిధ ప్రతిష్టాత్మక కళాశాలల్లో నిర్వహించిన పోస్టర్ ప్రదర్శన, ప్రాజెక్ట్ ఎక్స్ పో పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ – సైన్స్, రామిరెడ్డి సుబ్బిరామిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ – టెక్నాలజీ, చిత్తూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఈ నెల 21, 22, 24 తేదీల్లో పోటీలు నిర్వహించారని వివరించారు. ఈ పోటీల్లో రైజ్ కళాశాలల నుంచి ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. లోయ ప్రాంతాలు, యూ–టర్న్‌లో రోడ్ యాక్సిడెంట్ల నివారణ, అధిక విద్యుత్ వోల్టేజీ కారణంగా గృహ పరికరాల రక్షణ, డ్రైవర్ నిద్రలేమి కారణంగా ప్రమాద నివారణ అంశాలపై వివరణకు ప్రథమ బహుమతి, పోస్టర్ థీమ్/టైటిల్ ఇండోర్ హోమ్ మానిటరింగ్, కంట్రోల్ సిస్టమ్ డిజైన్ అమలు అంశాలను పోస్టర్ ద్వారా ప్రదర్శించి ప్రథమ బహుమతులు గెలుపొందారని కళాశాల గౌరవ చైర్మన్ ఐ.సి.రంగమన్నారు తెలిపారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను ప్రశంసించారు. ఈఈఈ విభాగాధిపతి, డాక్టర్ రుషి సంతోష్‌సింగ్‌ఠాకూర్ విజేతలను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల గౌరవ చైర్మన్ రంగమన్నార్

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: స్థానిక తేరు బజార్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకుందాం

మార్కాపురం టౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం డివిజన్ యూటీఎఫ్ సమావేశం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీకి ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాల పేరుతో పాఠశాలల్లోని 3,4, తరగతులను విలీనం చేయడం వల్ల ఏక ఉపాధ్యాయుడితో నడిచే పాఠశాలలు కనుమరుగవుతాయన్నారు. ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమీషన్ ఏర్పాటు చేయడంతోపాటు 30 శాతం మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె అబ్దుల్ హై, రాష్ట్ర నాయకులు ఓవీ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బాబునాయక్, బాలవెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ చాపల వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌కే మహబూబ్, సినీనటుడు దన్నారపు మస్తాన్‌రావు, జానీ, ఎస్‌కే అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, తదితరులు

యువతకు ఆదర్శం.. భగత్‌సింగ్

చీమకుర్తి: భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరాస్వామి, దేవరాజు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆటో డ్రైవర్‌కు ఆర్థికసాయం

ఒంగోలు టౌన్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒంగోలు నగరానికి చెందిన ఆటో డ్రైవర్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆర్థికసాయం అందజేసి ఆదుకుంది. నగరానికి చెందిన ఆటోడ్రైవర్ రంగాశెట్టి శాంతారావు బ్రెయిన్ హెమరేజ్‌తో కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. ఆయన కుటుంబం ఆర్థికసాయం కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ప్రతినిధులను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు అతడికి చికిత్స కోసం అవసరమైన రూ.22 వేలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, కార్యదర్శి గ్రంధి పార్థసారధి, పూర్వ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, మిరియాల కృష్ణమూర్తి, వంకదార సతీష్, నేరెళ్ల రాంబాబు, బియ్యపు విజయ్, శ్రీనివాసరావు, చంద్ర మాస్టర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉగాది కవి సమ్మేళనంలో జిల్లా కవులు



కవి సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా కవులు

ఒంగోలు మెట్రో: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరులో నిర్వహించిన ద్విశతాధిక జాతీయస్థాయి కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. వసంతాన్ని స్వాగతిస్తూ, చైత్రాన్ని పలకరిస్తూ ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. వీరిని అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ఇతర ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన జాలాది మోహన్, మైనంపాటి సాయికుమార్, నెమ్మాని సీతారామమూర్తి, నెమ్మాని హరిప్రియాదేవి, బంతికట్ల నాగేశ్వరరెడ్డి, మోడీ, గర్నెపూడి యోబు, దేవరకొండ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా బావి

ఒంగోలు సబర్బన్: నగరంలోని సంతపేటలో పాత అభిలాష్ లాడ్జికి తూర్పువైపున ఇళ్ల మధ్యలో ఉన్న రాణి గారి బావి ప్రమాదకరంగా మారింది. 150 సంవత్సరాల క్రితం ఈ బావిని ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ బావిలో పుష్కలంగా నీరుంది. బావికి మూడు వైపులా ఎత్తైన గోడను స్థానికులు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఒకవైపు మాత్రం గోడ ఎత్తు తక్కువగా ఉంది. నివాస ప్రాంతాల మధ్య ఉండటంతో ఆ బావి చుట్టూ పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆ బావిని అధికారులు పూర్తిగా విస్మరించడంతో బావిలోపల గోడల్లో నుంచి చెట్లు మొలిచి పైవరకూ పెరిగాయి. గతంలో ఆ బావిలో దూకి నలుగురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. బావిలోని చెట్లు కొట్టేసి మరమ్మతులు చేసి చుట్టూ రక్షణతో పాటు బావిపై ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో ఉన్న బావి

ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగి ఉండాలి



ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి బృందం

సంతనూతలపాడు: సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రుద్రవరం గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ వి.అనిల్ కుమార్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన పాఠశాల పిల్లలకు ఫ్లోరోసిస్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు క్రాస్ చెక్ చేసి, ఆరోగ్య సంబంధ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు సలహాలు, సూచనలు చేసింది. అలాగే, ఫ్లోరోసిస్ సర్వేకు అనుబంధంగా కమ్యూనిటీ సర్వేలో భాగంగా గృహాలను సందర్శించి వారి వివరాలు సేకరించి ఫ్లోరోసిస్, ఎన్సీడీసీడీకి సంబంధించిన పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించారా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విద్య ద్వారా 100 శాతం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని, దానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.నాగరాజు, సీహెచ్‌ఓ ఆర్.ప్రసాద్, కృష్ణ, పి.ఆదిత్య, ఏఎన్ఎం సునీత, ఆశా వర్కర్లు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాములకు పూజలు



సీతారాములకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: నగరంలోని సీతారామపురం కొండపై వేంచేసియున్న అతి పురాతన సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి అభిషేక కైంకర్యం నేత్రపర్వంగా సాగింది. అర్చకులు గర్భాలయంలోని శ్రీ సీతాలక్ష్మణ సమేత సీతారామస్వామి వారికి అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారాములకు అభిముఖంగా కొలువై ఉన్న ఆంజనేయునికి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. దేవతామూర్తులకు ప్రత్యేక హారతులు అందజేసి అభిషేక ద్రవ్యాలను సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సీతారామస్వామి దేవాలయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, ఉభయదాతలు శ్రీదేవి దంపతులు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన పురుగుమందులు అందించాలి



తనిఖీలు నిర్వహించి యాజమాన్యంతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు

మద్దిపాడు: రైతులకు నాణ్యమైన పురుగుమందులు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో సదరన్ పేస్ట్ కంపెనీలో పురుగుమందుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన పురుగు మందులు తయారు చేసి అందించాలని ఆదేశించారు. కంట్రోల్ టెక్నికల్ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్‌నాయక్, రమేష్‌బాబు, జిల్లా కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, మద్దిపాడు మండల వ్యవసాయ అధికారి కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.